# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :213 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 31-10-2025 | పేజీలు:4 వెల: 2.00


### శబరిమల అయ్యప్ప దర్శనం.. నవంబర్ 1 నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

పాతనంతిట్ట: శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలకు చెందిన ఆన్‌లైన్ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్నది. ఈ ఏడాది కూడా భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం రానున్నారు. మండల పూజ సీజన్ నవంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. డిసెంబర్ 27వ తేదీన ఆ సీజన్ ముగియనున్నది. అయితే దీని కోసం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం వర్చువల్ క్యూ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు బోర్డు చెప్పింది. ప్రతి రోజు 70 వేల మంది భక్తులకు క్యూలైన్ టికెట్లను అమ్మనున్నారు. ఇక స్పాట్ బుకింగ్ కోసం 20 వేల టికెట్లను కేటాయించారు.మండల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించింది. పంబ వద్ద భారీ పందిరిని నిర్మించనున్నారు. ఒకేసారి పది వేల మంది భక్తులు సేద తీరే తరహాలో ఆ పందిరి నిర్మాణం ఉంటుంది. భక్తుల తాకిడిని తట్టుకునేందుకు సుమారు 50 లక్షల అరవణం ప్రసాదం బాటిళ్లు కూడా సిద్ధం చేస్తున్నారు. రెండు నెలల పూజల కోసం నవంబర్ 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు శబరిమల ఆలయాన్ని

## తెలంగాణలో భారీ వర్షాలు.. నీటమునిగిన పంట పొలాలు




కరీంనగర్: మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూళ్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల – హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూళ్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు.తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## ప్రతీ ఒక్క అధికారి ఫీల్డ్‌లోనే ఉండాలి.. కలెక్టర్లతో వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మొంథా తుపానుప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా పంట, ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ నేపథ్యంలోనే తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ వేముల శ్రీనివాసులు, డీజీపీ శివధర్ రెడ్డి, ఎండీ అశోక్ రెడ్డి, తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై పౌర సరఫరాల విభాగం ఎప్పటికప్పుడు కలెక్టర్లకు తగిన సూచనలు చేయాలన్నారు.

ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి వారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. అవసరమైన చోట ధాన్యాన్ని దగ్గరలోని ఫంక్షన్ హాళ్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 24 గంటల పరిస్థితిపై ప్రతి రోజూ కలెక్టర్‌కు రిపోర్ట్ అందజేయాలన్నారు. రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై



తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ ఒక్క అధికారి ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని, జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా ఒక మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలన్నారు. చెరువులు, వాగులు, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లో లెవల్ కల్వర్టుల దగ్గర పరిస్థితులను గుర్తించి స్థానికులను ముందే అలర్ట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన కాసేపట్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించేందుకు మంత్రులతో కలిసి ఏరియల్ సర్వేకు బయలుదేరనున్నారు.

## కేసీఆర్ కు ఏమైంది.. ఏంటి పరిస్థితి.. అభిమానుల్లో ఆందోళన?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో కీలక నాయకుడిగా, ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తాజా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఆయన కర్రకు ఆధారపడి నడుస్తూ కనిపించడంతో అభిమానులు, పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిన్న మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి శంకర్‌రావు భౌతికకాయానికి కేసీఆర్ హాజరయ్యారు. అయితే ఆ సందర్భంలో ఆయన కర్ర పట్టుకుని నడవడం, కొంత బలహీనంగా కనిపించడం గమనించిన వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఎప్పుడూ ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కనిపించే కేసీఆర్ ఈసారి అలసటతో, నిదానంగా నడవడం చూసి అభిమానులు విచారంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు."మన నాయకుడు త్వరగా కోలుకోవాలి", "కేసీఆర్ మళ్లీ పాత ఉత్సాహంతో ప్రజల్లోకి రావాలి", "రాష్ట్రానికి ఆయన అవసరం ఉంది" అంటూ ట్వీట్లు, కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.గత కొద్ది నెలలుగా కేసీఆర్ ఆరోగ్య కారణాల వల్ల ప్రజా కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల తర్వాత ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని, వైద్యుల సలహాప్రకారం పబ్లిక్ కార్యక్రమాలు తగ్గించుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు ఆయన తాజా ఫోటోలు, వీడియోలు చూసి అనుచరులు మరింత ఆందోళన చెందుతున్నారు.

గత ఆరోగ్య సమస్యలు

గత కొన్ని నెలలుగా కేసీఆర్ అస్వస్థత కారణంగా ప్రజా కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తుంటి ఆపరేషన్ కేసీఆర్ కు జరిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల



తర్వాత ఇంటి వద్ద పడిపోవడంతో ఆయన తుంటికి గాయమైంది. దీనికిగాను ఆయనకు శస్త్రచికిత్స జరిగింది.కొద్ది నెలల క్రితం (జూలై 2025లో) నీరసంగా ఉండటంతో ఆసుపత్రిలో చేరారు. అప్పుడు బ్లడ్ షుగర్, సోడియం లెవెల్స్‌లో తేడాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు.తాజాగా కర్రసాయంతో నడిచారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పై అధికారిక ప్రకటన ఏదీ వెలువడనప్పటికీ, పార్టీ నాయకులు ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.రాష్ట్ర ప్రజలకూ, బీఆర్ఎస్ కార్యకర్తలకూ ఆయన ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని భావిస్తున్నారు. రాజకీయ వర్గాలు కూడా కేసీఆర్ త్వరగా కోలుకుని మళ్లీ చురుకుగా కార్యకలాపాలు ప్రారంభిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## మంత్రి కోమటిరెడ్డి అలిగారా? కాంగ్రెస్‌లో చర్చ!



హైదరాబాద్,తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కారులో మంత్రి పదవులు దక్కించుకున్నది 14 మంది. అయితే.. వీరిలో నలుగురు నుంచి ఆరుగురు వరకు వివాదాల్లో మునిగి తేలుతున్నారన్న చర్చసాగుతోంది. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఇలా.. కొందరు మంత్రులు వివాదాలు.. గిల్లికజ్జాల చుట్టూ తిరుగుతున్నారు. వారిని సముదాయించలేక.. వస్తున్న విమర్శలకు చెక్ పెట్టలేక అటు పార్టీ అధిష్టానం.. ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో తాజాగా మరో వివాదం తెరమీదికి వచ్చింది. ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంతు వచ్చిందనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం ఆయన తెలంగాణ సినిమాటో గ్రఫీ మంత్రిగా ఉన్నారు. సో.. సినిమా రంగానికి సంబంధించిన కార్యక్రమాలు, నిర్ణయాలు వంటివి ఆయనే చూడాలి. అయితే.. తన ప్రమేయం లేకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారన్న బాధ కోమటిరెడ్డిలో కనిపిస్తోందని పలువురు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కూడా ఓ కీలక సినిమా విషయంలోఇంత జరిగిందా.. అంత జరిగిందా.. నాకేం తెలుసు. ఏదైనా ఉంటే వారినే అడగండ అంటూ.. వెంకటరెడ్డి వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.ఆ తర్వాత సినిమా టికెట్ల వ్యవహారం.. చర్చకు వచ్చినప్పుడు కూడా ఆయన మౌనంగా ఉన్నారు. మాలాంటోళ్లు ఏమైనా మాట్లాడితే.. ఇబ్బంది అవుతుంది. అందుకే గమ్మున ఉంటున్నాం. అని అన్నారు. ఇక, ఇప్పుడు మంగళవారం జరిగిన సినీ ఆర్టిస్టు సంఘాల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కానీ, అదే శాఖకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆహ్వానం అందలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అంతేకాదు.. టికెట్ల ధరల పెంపులో 20 శాతం కార్మికులకు ఇవ్వాలన్న ప్రతిపాదన విషయం కూడా తన దృష్టిలో లేదని ఆయన వాపోతున్నారని సమాచారం. దీంతో మంత్రి ఇప్పుడు అలిగారని.. కాంగ్రెస్‌లో చర్చ సాగుతోంది. మరి ఇది ఎంత వరకు వాస్తవమో చూడాలి.

## కోడ్ ఉండగా మంత్రిని నియమించవచ్చా?




హైదరాబాద్: రాష్ట్రంలోని ఓ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతుండగా, రాష్ట్ర మంత్రిగా ఎవరినైనా నియమించవచ్చా?. ఆ అసెంబ్లీ స్థానం పరిధిలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కాదా?. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ముఖ్యమంత్రి సిఫారసుల మేరకు గవర్నర్ కొత్త మంత్రిని నియమించవచ్చా?. ఈ సందేహాలకు కేంద్ర ఎన్నికల సంఘమే సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయ వర్గాలు స్పష్టం చేశాయి.జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి వచ్చే నెల 11న ఉప ఎన్నికలు జరగనుండగా, ఈ నెల 31న మాజీ క్రికెటర్ ముహమ్మద్ అజారుద్దీన్‌తో రాష్ట్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వచ్చే డిసెంబర్ ఏడో తేదీతో రెండేళ్లు పూర్తికానుండగా, ఇప్పటి వరకు రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లింలకు చోటు కల్పించలేదు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం పరిధిలో గణనీయ సంఖ్యలో ఉన్న ముస్లిం ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితిలో అజారుద్దీన్‌ను మంత్రిగా ప్రభుత్వం నియమించనుండటం ఆసక్తికరంగా మారింది.

నాడు సీఎంకు నేరుగా ఈసీ ఫోన్..

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా మంత్రివర్గంలో కొత్త మంత్రిని నియమించవచ్చా? గతంలో ఇలాంటి ఘటనలెక్కడైన జరిగాయా? అప్పుడు ఎన్నికల సంఘం ఏం చేసింది? అనే సందేహాలను కేంద్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా ఇటీవల హైదరాబాద్‌లో ఇచ్చిన ఓ ఉపన్యాసంలో నివృత్తి చేశారు. మంతన్ ఆధ్వర్యంలో గత సెప్టెంబర్ 13న నగరంలోని విద్యా అరణ్య పాఠశాలలో నిర్వహించిన సంస్థ సహ వ్యవస్థాపకుడు 'అజయ్ గాంధీ' స్మారక ఉపన్యాసంలో ఈ మేరకు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.గతంలో గోవాలోని ఓ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతుండగా, ఆ స్థానం పరిధిలో గణనీయ సంఖ్యలో ఉన్న సామాజికవర్గానికి సంబంధించిన ఓ వ్యక్తిని రాష్ట్రమంత్రిగా నియమించాలని అప్పటి సీఎం మనోహర్ పారికర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నాటి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ నేరుగా మనోహర్ పారికర్‌కు ఫోన్ చేసి ఉప ఎన్నికలు ముగిసే వరకు కొత్త మంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని కోరారని అశోక్ లావాసా వెల్లడించారు. మంత్రుల నియాయకం విషయంలో రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను సైతం వాడుకోలేనా? అని మనోహర్ పారికర్ బదులిచ్చారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో కొత్త మంత్రితో ప్రమాణస్వీకారం చేయిస్తే ఆ సామాజికవర్గ ఓటర్లను ప్రభావితం చేసినట్టు అవుతుందని ప్రధాన కమిషనర్ నచ్చజెప్పడంతో అప?ట్లో మనోహర్ పారికర్ వెనక్కుతగ్గి ప్రమాణస్వీకారోత్సవాన్ని వాయిదా వేసుకున్నారని అశోక్ లావాసా తెలిపారు. రాష్ట్రంలో కొత్త మంత్రిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వస్తున్న వార్తలపై సీఈఓ కార్యాలయం స్పందనను కోరగా, దీనిపై తమకు ఏమైన ఫిర్యాదులు వస్తే కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామని బదులిచ్చారు. ఈసీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. –ముహమ్మద్ ఫసియుద్దీన్.

### ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

హైదరాబాద్,ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నా మన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బంద్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీన గర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసమే మంత్రివర్గంలోకి అజారుద్దీన్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు.జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం




చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

## మంత్రుల జల్సాలకు హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే రావా?



హైదరాబాద్ : ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ జూబ్లీహిల్స్‌లో ఊరేగితే రాష్ట్రంలో పాలన పరిస్థితి, ప్రజల పరిస్థితి ఏంటి? అని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రుల జల్సాలకు హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే రావా? అని నిలదీశారు. హనుమకొండ, జులైవాడలో భారీగా కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీలతో పాటు అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ఉధృతిని గ్రేటర్ వరంగల్ అధికారులతో కలిసి రాకేశ్ రెడ్డి పరిశీలించి, పలు సూచనలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. మొంథా వరద బీభత్సంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు నీటి మునిగి, నగరం జల దిగ్బంధం అయింది. నిత్యావసర వస్తువులు సహా, విలువైన టీవీ, బీరువాలు సైతం నీట మిగిని ఆస్తి నష్టం వాటిల్లింది. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీటమునిగిన ఇళ్లల్లోనే గడిపారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా గ్రహించి అంచనా వేయడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తక్షణమే నీటి మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలి అని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.సమ్మయ్య నగర్ పూర్తిగా నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ఆవులు, గేదెలు, పశువులు అరుస్తూ వరదల్లో కొట్టుకుపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఆస్తి నష్టంతో పాటు పశు పక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా వాటిల్లే ప్రమాదం ఉంది. మొంథా తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన ముందస్తు చర్యలేవి? ఈ సమయంలో ఒక్క జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జీగా ఉండి.. వరద ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాలి. కానీ జూబ్లీహిల్స్‌లో ఒక్కో మంత్రి ఒక్కో డివిజన్‌కు ఇంచార్జిగా ఉన్నారని రాకేశ్ రెడ్డి మండిపడ్డారు.

## సంపాదకీయం

శుక్రవారం 31-10-2025

# ఓటర్ల జాబితా సవరణలు అవసరమే !

ఓటరు నమోదు ప్రక్రియలో లోపాలను సరిచేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికీ పక్కా ప్రణాళిక లు చేపట్టడం లేదు. ఆధార్ తరహాలో పర్మినెంట్ నంబర్ వచ్చేలా, మార్పులు చేర్పులు చేసుకునేలా వ్యవస్థను పటిష్టం చేయడం లేదు. సాంకేతికంగా ఇంతగా అభివృద్ధి చెందిన దశలో ఇసి సాంకేతికతను అందిపుచ్చుకోవడం లేదు. బీహార్‌ల చేపట్టిన ఓటర్ల సవరణ సర్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే అందులో విపక్ష కాంగ్రెస్ పార్టీ కుట్రకోణం కూడా ఉంది. ఓట్లను తొలగిస్తే ప్రజలు తిరుగుబాటు చేయాలి. తమ ఓట్లు గల్లంతు అయ్యాయని చెప్పాలి. కానీ ఎక్కడా ఇలాంటి ఆరోపణలు రాలేదు. ఒకవేళ ఒకటిరెండుచోట్ల వచ్చినా, స్థానిక అధికారులను కలిసి వారు తమ ఓటును పునరుద్ధరించుకున్నారు. పెద్ద మొత్తంలో ఓట్లు గల్లంతు అయినట్లుగా ..ఓట్ చోరీ గురించి ఆరోపణలు చేసి, అభాసుపాలయిన రాహుల్ గాంధీ ఎక్కడా ఓట్ల గల్లంతుపై ఒక్కటంటే ఒక్క అఫిడవిట్ దాఖలు చేయలేకపోయారు. సుప్రీం కూడా ఇదే సూచించింది. ఓట్లు గల్లంతయిన వివరాలను సమర్పించాలని కోరితే రాహుల్ ఇప్పటికీ ముందుకు రాలేకపోయారు. అంటే ఇందులో ప్రచారయావ తప్ప నిజాలు లేవని తెలుస్తోంది. ఈ క్రమంలో దేశంలోని మరికొన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశంలో చనిపోయిన వారి ఓట్లతో పాటు అక్రమంగా చొరబాటు ద్వారా వచ్చిన వారి ఓట్లను గుర్తించి తొలగిచాల్సిందే. ఇందులో ఎలాంటి రాజీపడాల్సిన అవసరం లేదు. మన ఓటర్ల జాబితాలో దేశ విద్రోహశక్తులు చేరి, మన ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే చర్యలు వ్యతిరేకించాల్సిందే. రోహింగ్యాలు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి తిష్టవేసిన వారి ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించాల్సిందే. ఎన్నికల పక్రియకు రెండు నెలల ముందు బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలయ్యాయి. విచారణ చేపట్టారు. ఓట్ల తొలగింపు ఆధారాలు చూపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని విపక్షనేత రాహుల్‌కు సుప్రీం సూచించింది. అయితే దీనిపై ఆయన ఒక్క అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. ప్రస్తుత దశలో వివిధ రాష్ట్రాల్లో 51 కోట్ల మందిపైగా ఓటర్ల వివరాలు నిగ్గుతేల్చే ఎస్ఐఆర్‌ను చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధతను చాటుకోవడంగానే చూడాలి. ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీలు తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానాలి. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్ఐఆర్ చేపట్టవద్దని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదే. ఇది ఓ రకంగా ఓఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుంది. ఎవరు ఓటరో కాదో తేల్చుకునే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రసాజ్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం అనేక ప్రాంతాలకు వెళుతుంటారు. కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం కూడా జరుగుతుంది. ఈ క్రమంలో ఓటర్ల జాబితా ఆధునీకరణ పక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగా చేపట్టాల్సిందే. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిది. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ పోవాల్సిందే. అయితే శేషన్ లాంటి వారు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో పారదర్శక ఎన్నికలకు అవకాశం ఏర్పడింది. ఆ తరవాత ఎన్నికల కమిషనర్లుగా వచ్చిన వారెవ్వరూ శేషన్ అడుగుజాడల్లో నడవలేదు. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో చట్టం చేసింది. బీహార్ ఎస్ఐఆర్ పక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వనే లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టడం వల్ల కొందరికి అనుమానాలు రావచ్చు. కానీ ఓటర్ల జాబితాలను నవీకరించుకోవాలన్న సంకల్పాన్ని నిలదీయలేం. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఏవైనా అభ్యంతరాలను పక్కన పెడితే నిలదీయాలి. అర్హులైన వారి ఓట్లు గల్లంతయితే అడగాలి. అంతేగానీ ప్రక్రియను చేపట్టడాన్ని నిలదీయడం లేదా బహిష్కరించడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. సర్ ప్రక్రియ సక్రమంగా సాగడానికి, పారదర్శకంగా జరగడానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తోడ్పాటును అందించాలి.

# ఆర్థిక నేరగాళ్ల అప్పగింతలో పురోగతి




న్యూఢిల్లీ,వేల కోట్ల రుణాలు తీసుకుని దేశం విడిచి పరారైన ఆర్థిక నేరస్థులను తిరిగి స్వదేశానికి రప్పించడం పెద్ద సవాలుగా మారింది. ఈ నేరస్థులను తిరిగి రప్పించడంలో 35 శాతం వరకు విజయం సాధించినట్టు తెలుస్తోంది. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. ప్రజల నమ్మకాన్ని తగ్గిస్తాయి. ప్రభుత్వ ఆర్థిక వనరులపై ఒత్తిడిని పెంచుతాయి. అభివృద్ధికి నిరోధకాలుగా పరిణమిస్తాయి. ఇది గ్రామీణ, పేద ప్రజలపై వ్యతిరేక ప్రభావం చూపిస్తుంది. ఆర్థిక నేరాల కేసులు చాలా ఏళ్ల పాటు విచారణలో ఉండడంతో న్యాయ వ్యవస్థపై వ్యతిరేక ప్రభావం చూపడమే కాక, నేరస్థులు తప్పించుకోడానికి దారులు వెతికే పరిస్థితి ఏర్పడుతుంది. మహా నగరాల్లో ఆర్థిక నేరాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఉదాహరణకు 2018తో పోలిస్తే 2023లో ఈ నేరాలు దాదాపు 31% పెరిగాయని నివేదికలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం విదేశాలకు భారత్ నుంచి పరారైన ఆర్థిక నేరగాళ్ల జాబితాలో పుష్పేష్‌బైద్, ఆశిష్ జోబన్‌పుత్ర, విజయ్ మాల్యా, సన్నీకల్రా, సంజయ్ కల్రా, సుధీర్ కుమార్ కల్రా, ఆర్తికల్రా, జతిన్‌మెహతా, ఉమేష్ పరేఖ్, కమలేష్ పరేఖ్, నీలేష్ పరేఖ్, నీలవ్ మోదీ గారవ్, ఏక్నాలవ్ గార్గ్ మోడీ, మెహుల్ చోక్సీ, సబ్యాసేథ్, రాజీవ్ గోయల్, అల్కా గోయల్, లలిత్ మోడీ, నితిన్ జయంత్‌లాల్ సందేశర, చేతన్‌కుమార్ సందేశర, రితేష్ జైన్, హితేష్ నరేంద్రభాయ్ పటేల్, మయూరి బెన్ పటేల్, ప్రీతి ఆశిష్ జోబన్‌పుత్ర తదితరులు సుమారు 75 మంది ఉన్నారు. ఈ మోసగాళ్ల నుంచి ఇప్పటివరకు 15.113 కోట్ల రూపాయలను రికవరీ చేసినట్టు కేంద్రం తెలియజేసింది. ఇంకా వీరిలో చాలా మందిని తిరిగి రప్పించి శిక్షించడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ ప్రధాన నిందితుడు మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించడానికి బెల్జియం కోర్టు అంగీకరిస్తూ తీర్పు చెప్పడం భారత్ చేసిన ప్రయత్నాల్లో ముఖ్యమైన పరిణామం. చోక్సీ 2018లో భారత్ నుంచి పరారైన దగ్గర నుంచి భారత్ అతడ్ని వెనక్కు రప్పించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ అభ్యర్థనపై చోక్సీని బెల్జియం నిర్బంధంలో ఉంచింది. భారత్‌కు తనను అప్పగిస్తే అక్కడ తాను నరకం అనుభవించవలసి వస్తుందని చోక్సీ వాదిస్తూ సమర్పించిన డాక్యుమెంట్లు సరిగ్గా లేవని బుధవారం బెల్జియం కోర్టు వెల్లడించింది. చోక్సీ భద్రతకు, అందుకు తగినట్టు జైళ్ల ఏర్పాట్లకు హామీ భారత్ ఇచ్చిన నేపథ్యంలో భారత్ జైళ్లలో తనను సరిగ్గా చూడరన్న చోక్సీ వాదనను బెల్జియం కోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు భారత్‌కు చోక్సీ అప్పగింత ఫలప్రదమైతే ప్రపంచం మొత్తం మీద గత రెండు దశాబ్దాలుగా భారత్‌కు అప్పగించిన మూడో వంతు ఆర్థిక నేరస్థుల సుదీర్ఘ జాబితాలో చోక్సీ పేరు చోటు చేసుకుంటుంది. ఈ ఏడాది భారత్ సాధించింది చోక్సీ కేసు ఒక్కటే కాదు. గత నెల బ్రిటన్ క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ ప్రతినిధి వర్గం జైళ్ల పరిస్థితిని సమీక్షించడానికి తీహార్ జైలును సందర్శించింది. విజయ్ మాల్యా, నిరావ్ మోడీ వంటి ఆర్థిక నేరస్థులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులను బ్రిటన్ నుంచి భారత్‌కు అప్పగించడానికి కావలసిన వెసులుబాటు కల్పించడానికే ఇదంతా. ఇటువంటి ఆర్థిక నేరస్థులపై దర్యాప్తులు, విచారణ సాగించడానికి లేదా శిక్షించడానికి ఆయా దేశాల్లో ఉన్న నేరస్థులను భారత్‌కు అప్పగించాలన్న అభ్యర్థనలు జోరందుకుంటున్నాయి. ఈ మేరకు 48 దేశాలు, ప్రాదేశిక ప్రాంతాలతో నేరస్థుల అప్పగింతలకు సంబంధించిన ఒప్పందాలను భారత్ కుదుర్చుకుంది. అలాగే 12 దేశాలతో అప్పగింత ఏర్పాట్లు చేసుకుంది. గత ఐదేళ్లలో 133 నేరస్థుల అప్పగింతల అభ్యర్థనలను భారత్ చేసింది. 2020 నుంచి 2024 కాలంలో ఒక్క 2024 లోనే 39 అభ్యర్థనలను చేయడం విశేషం. అలాగే భారత్ నుంచి పరారైన నేరస్థుల అప్పగింతలకు సంబంధించి విదేశాల నుంచి 79 అభ్యర్థనలను 202024 లో అందుకోగలిగింది. విదేశాల నుంచి భారత్‌కు ఆర్థిక నేరస్థులను, మోసగాళ్లను, ఫోర్జరీ కేసుల నేరస్థులను అప్పగించడంలో 2022 నుంచి 35 శాతం వరకు సాధించడమైంది. అగస్టావెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ ఒప్పందం స్కామ్‌కు సంబంధించి ఆర్థిక నేరాలకు పాల్పడిన నిందితుడు క్రిస్టియన్ మేకేల్ యునైటెట్ అరబ్ ఎమిరేట్స్ నుంచి భారత్‌కు అప్పగించడమైంది. మొత్తం కేసుల్లో ఉగ్రవాద కార్యకలాపాల్లో పాలుపంచుకున్న లేదా ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందించిన, భారత్‌కు వ్యతిరేకంగా దాడులకు పాల్పడే ప్రయత్నం చేస్తున్న నేరస్థుల కేసులు 27.5 శాతం వరకు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో 26/11 ముంబై ఉగ్రదాడుల కీలక సూత్రధారి తహవూర్ రాణాను అమెరికా ఈ ఏడాది భారత్‌కు అప్పగించింది. భారత్‌కు అప్పగించనున్న నేరస్థుల మొత్తం కేసుల్లో హత్య లేదా హత్యాయత్నం కేసులు 21.3 శాతం ఉన్నాయి. మాదకద్రవ్యాలు, లైంగిక నేరాలు వంటి కేసులతో సహా మొత్తం కేసులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాబితా తయారు చేసింది. 2002 నుంచి 2018 మధ్యకాలం లోను, 2024 నుంచి 2025 కాలం లోనూ విదేశాల నుంచి అప్పగించిన నేరస్థుల జాబితాను దేశాల వారీగా వేర్వేరుగా ప్రదర్శించింది. ఈ రెండు దశల్లోనూ మొత్తం 26 దేశాల నుంచి నేరస్థులను భారత్ రప్పించుకోగలిగింది. అలాంటి మొత్తం కేసుల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా దేశాలు కలిపి మొత్తం 46 శాతం ఉన్నాయి. క్రమంగా కనీసం 25, 12 మంది పరారీ నేరస్థులను ఆ రెండు దేశాల నుంచి రప్పించుకోగలిగింది.

# పత్తి రైతు మెడపై తేమ కత్తి..అన్నదాత జీవితాలతో చెలగాటం!


హైదరాబాద్,పత్తి రైతు మెడపై తేమ కత్తి వేలాడుతోంది. కొద్ది రోజులుగా వాతావరణంలో జరుగుతున్న మార్పులు పత్తి పండించిన రైతులను తీవ్రంగా కలవరపరుస్తోంది. పూత, కాత దశ దాటి చేతికొచ్చిన పత్తిని ఏరి మార్కెట్ లో విక్రయించే ఈ సమయంలో అకాల వర్షాలు, చిరు జల్లులు, తుపాన్ ప్రభావం, వాతావరణంలో పొడి తగ్గిపోయి నెలకొన్న తేమ వాతావరణంతో పత్తి ఆరబెట్టలేని దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో అమ్మబోతే అడివి కొనబోతే కొరివి అనే తీరుగా పత్తి వేసిన రైతుల పరిస్థితి మారింది. విత్తనాలు, ఎరువులు ఇతరత్రా పత్తి సాగుకు అవసరమైన ఖర్చులు తడిసి మోపెడవుతుండగా మార్కెట్ లో అమ్మకానికి వచ్చే సరికి అన్ని అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఎటూ పాలుపోని పరిస్థితిల్లో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అమ్మబోతే అడివే..

చేతికొచ్చిన పంటను మార్కెట్లో విక్రయిద్దామంటే తేమ అడ్డంకిగా మారుతోంది. పోనీ, ఏరిన పత్తిని ఆరబెట్టి విక్రయిద్దామంటే సాధారణంగా ఏ రైతు ఇల్లు అంతపెద్దగా ఉండే పరిస్థితి ఉండదూ, కల్లాల్లో ఆరపోద్దామంటే అకాల వర్షాలు, జల్లులు, తేమ వాతావరణంతో అగ్నిపరీక్షగా మారుతోంది. ఈ కారణంగా రైతులు పత్తిని మార్కెట్‌కు తెచ్చి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి విక్రయించే ప్రయత్నం చేస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటున్నందున ధర అమాంతం తగ్గించేస్తున్నారు. తేమ శాతం 12కు మించితే సీసీఐ పత్తిని కొనేందుకు కూడా అంగీకరించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ముందుగానే ఇళ్ళవద్ద దళారులకు విక్రయించడమో? లేదా? మార్కెట్ కు తెచ్చిన తర్వాత దళారులను ఆశ్రయించడమో చేస్తున్నారు. ఇదే అదునుగా ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతుల ఆదాయం భారీగా తగ్గుతోంది. దీనికి తోడు తాజాగా సీసీఐ తెచ్చిన నిబంధనలు సగటు రైతును అవస్థలపాలు చేస్తోంది.రైతులను ఐటి నిపుణులుగా భావిస్తున్నారా? అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతోందంటున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తేమ శాతం పెద్ద ఇబ్బందిగా మారి రైతులపాలిట శాపంగా మారినందున ఈ అంశం పై కేంద్రంతో మాట్లాడుతున్నట్లు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. రైతుల దయనీయ స్థితి, కనీస మద్దతు ధర లభించని తాజా పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్రం ముందుకు వచ్చి, తేమ శాతంలో ఏమైనా సడలింపు ఇస్తుందా? లేదా? ధరల్లో కోత లేకుండా సీసీఐ కొనుగోలు చేసే విధంగా మార్పులు చేస్తుందా? అనే ఆసక్తి నెలకొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లేఖ రాసింది. తాజా చర్చల వల్ల కేంద్రం, సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందిస్తారా? అనే అనుమానాలు నెలకొన్నాయి.

మద్దతు ధర శుద్ధ అబద్దం!

మద్ధతు ధర ప్రకటించే కేంద్ర ప్రభుత్వం ఈసారి పత్తి క్వింటాల్ కు రూ. రూ.8,110లుగా ప్రకటించింది. ఈ పత్తిలో 8 శాతానికి మించి తేమ శాతం ఉండకూడదని నిబంధన విధించింది. తేమ శాతం ఒకటి పెరిగే కొద్ది క్వింటాల్



కు రూ. 81లు కోత విధిస్తామని స్పష్టం చేశారు. 9 శాతం ఉంటే రూ.8,028, 10 శాతం ఉంటే రూ.7,947, 11 శాతం ఉంటే రూ.7,866, 12 శాతం ఉంటే 7,785.60 ధర చెల్లిస్తారు. ఈ తేమ శాతం కూడా 12కు మించితే అసలు కొనుగోలు చేయమంటూ తేల్చిచెప్పారు. దీంతో కేంద్రం ప్రకటించిన మద్ధతు ధర రూ. 8,110లు కేవలం లాంఛనప్రాయంగా మారింది. తాజా పరిస్థితుల్లో పత్తిని ఆరబెట్టుకోలేక, ఇంట్లో నిల్వ చేస్తే తేమ శాతం పెరిగే అవకాశాలున్నందున మార్కెట్కు తీసుకొచ్చి రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు.మద్దతు ధర కంటే దాదాపు క్వింటాల్ కు రూ. 1000 నుంచి రూ.1,500లు ధర తగ్గించి దళారులు దండుకుంటున్నారు. ఇదిలా ఉండగా అకాలవర్షాలు, తేమ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ అన్ని చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రానున్న రోజుల్లో వీటిని ప్రారంభిస్తామంటున్నారు. ప్రస్తుతం ఎనుమాముల లాంటి పెద్ద మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 60 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని సీసీఐ ప్రకటించినప్పటికీ ప్రస్తుతం అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల ప్రారంభంలో మిగిలిన కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముందంటున్నారు.

కలిసిరాని ఖరీఫ్..

ఖరీఫ్ సీజన్ మొత్తం పత్తి రైతుల జీవితాలతో వరుణుడు చెలగాటమాడుతున్నారు. ఈసారి పత్తి రైతులకు ఏదీ కలిసిరాలేదు. గతానికి భిన్నంగా ఈ సారి ఖరీఫ్ సీజన్ ముందుగా మురిపించింది. కురిసిన వర్షాలతో రైతులు పత్తి విత్తనాలు నాటితే మొలకదశకు వచ్చిన పరిస్థితుల్లో వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో బిందు సేద్యం చేయాల్సిన రైతులు బిందె సేద్యం చేశారు. ట్యాంకర్లతో నీళ్ళు పోసి మొక్కను చంటిపిల్లల మాదిరిగా సాకారు. ఆ తర్వాత భారీ వర్షాలు, వరుస వానలతో పత్తి చేలు జాలువారిపోయాయి. మొక్క ఎదగకుండా పోయింది. మధ్యలో కారణాలేవైనా సర్కారు సకాలంలో ఎరువులు అందించలేకపోయాయి. ఈ కారణంగా చెంపదెబ్బ, గోడ దెబ్బ రెండు తగిలినట్లు పత్తి పంట పై ప్రభావం చూపాయి. పూత, కాత పై ప్రభావం కనబరిచి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఇప్పటికే పెట్టిన పెట్టుబడి చేతికొస్తుందా? లేదా? అనే ఆందోళనలో రైతులున్నారు.

# తుపాన్ ప్రభావంతో పశుగ్రాసం సిద్ధం

అమరావతి,మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. తీవ్ర తుపాను కోస్తాంధ్రలోని విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభావం చూపనున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వర్షప్రభావం రీత్యా 865 లక్షల మెట్రిక్ టన్నుల పశు గ్రాసాన్ని అధికారులు సిద్ధం చేశారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 38 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. 1.38 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నెల్లూరు జిల్లా ఉలవపాడు 12.6 సెంటిమీటర్లు, సింగరాయకొండలో 10.5 సెంటీ మీటర్లు, కావలిలో 12.2, దగదర్తిలో 12, బి.కోడూరులో 6, కళింగపట్నంలో 7, విశాఖపట్నం, తునిలో 2 సెంటిమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.రాష్ట్రవ్యాప్తంగా 403 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉండనుందని, అత్యవసర పరిస్థితి ఎదుర్కోనేలా మండలాల వారీగా 488 కంట్రోల్ రూమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 1204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 75,802 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 219కి పైగా మెడికల్ క్యాంపులను వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# ఈ విషయం ఎలా బయటపడింది?

న్యూఢిల్లీ,అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధానమంత్రిగా ఉన్నారు నరేంద్ర మోడీ. అంతేకాదు అమెరికా లాంటి దేశాలను సైతం సవాల్ చేస్తూ ముందుకు దూసుకెళు తున్నారు. స్నేహాన్ని ఇతర దేశాలతో కొనసాగిస్తూనే.. అవసరమైన సందర్భాల్లో భారత సైనిక సత్తాను ఇతర దేశాలకు అర్థమయ్యేలా చెబుతున్నారు. రక్షణ రంగంలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో.. వైద్యరంగంలో అనేకమార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఒకరకంగా ఆధునిక భారత్ ను నిర్మిస్తున్నారు నరేంద్ర మోడీ. అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్రికా వరకు భారతదేశంతో గతంలో ఉన్న దానికంటే గొప్పగా దౌత్య సంబంధాలను మెరుగుపరిచారు.

మన దేశం మీద విషం..

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. భారత్ మీద లేని విషాన్ని కక్కుతున్నారు. అనవసరమైన ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలో భారత్ తన స్వీయ సాధికారతను సాధించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే అన్ని దేశాలతో వ్యాపార భాగస్వామ్యాలను మెరుగుపరుచుకుంటున్నది. ఎగుమతుల విషయంలో స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఇది సహజంగానే అమెరికాకు కంటగింపుగా మారింది. అందువల్లే అమెరికా లేనిపోని కుట్రలను భారత ప్రధాని మీద చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో చైనా లో షాంగై సదస్సుకు ప్రధానమంత్రి వెళితే.. ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్యకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే దానిని రష్యా, చైనా వ్యూహాత్మకంగా తిప్పి కొట్టాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మోడీపై హత్యకు ప్రయత్నించిన ఆ వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అనుమానాస్పదంగా చనిపోయాడు. అతని వద్ద భారీగా నగదు లభ్యమైంది.

ఇలా వెలుగులోకి వచ్చింది..

వాస్తవానికి ఈ విషయాన్ని నరేంద్ర మోడీ నేరుగా చెప్పలేదు. ఈ విషయాన్ని బయట పెట్టడంలో ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. సద్దాం హుస్సేన్ లేదా గడాఫీ లాగా అమెరికాపై విమర్శలు చేయలేదు. కేవలం పత్రికల ద్వారానే ఈ వార్తను లీక్ చేయించారు. హత్యాయత్నం జరిగిన మాట వాస్తవం. అయితే రష్యా ప్రయత్నం వల్ల ఇది ఆగిపోయిందని ప్రజలకు తెలిసే మాదిరిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేశారు.

గతంలో రెండుసార్లు..

మనదేశంలో 1966, 1984 తర్వాత ప్రధానమంత్రి పై జరిగిన మూడవ హత్యాయత్నం.. ఒకవేళ నరేంద్ర మోడీని చంపడం లేదా తొలగించేందుకు ప్రయత్నాలు గనుక జరిగితే.. దీనికి గనక ప్రతిపక్షం సహాయం చేస్తోందని కేంద్రం కనుక ప్రకటిస్తే.. ఆ తర్వాతి పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయి. ఒకవేళ గనుక రాహుల్ గాంధీ బడాయి మాటలు మాట్లాడి.. నరేంద్ర మోడీపై దాడి జరిగితే.. ఆ సమయంలో రాహుల్ గాంధీ ద్వేషాన్ని గనక వ్యాప్తి చేస్తే.. అప్పుడు జరిగే పరిణామాల వల్ల కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ఇబ్బంది పడతారు..

ఇబ్బంది పడక తప్పదు

రాహుల్ గాంధీకి రక్షణ ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి, ప్రజల ఆగ్రహానికి ఖచ్చితంగా గురవుతారు. ఇది కాంగ్రెస్ పార్టీని పెనం నుంచి పొయ్యిలోకి లాగే ప్రయత్నం లాంటిదే.. అయితే ఈ కుట్ర వెనుక రాహుల్ గాంధీ పేరు వినిపించడం లేదు. ఇటీవల అమెరికాకు రాహుల్ గాంధీ వెళ్లారు. ఆయన కొంతమంది వ్యక్తులను కలిశారు. అయితే ఆ వ్యక్తులను అక్కడి డీప్ స్టేట్ కూడా ఇష్టపడకపోవడం విశేషం. అమెరికాలో కూడా రాహుల్ గాంధీకి విశ్వసనీయత లేకపోవడం అత్యంత బాధాకరం. ఇక అమెరికా కూడా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. హమీద్ కర్జాయ్, మహమ్మద్ యూసఫ్ లాంటి వ్యక్తులను మాత్రమే గద్దెనెక్కించింది. దీనిని బట్టి అమెరికా ప్రణాళిక ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సమయమనం అవసరం..

పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ మన దేశ ప్రజలు ఇలాంటి ఉద్రిక్తతలో సమయమనం పాటించాలి. దేశంలో అరాచకం సృష్టించకుండా ఉండాలి.. ఇప్పుడు ఇక చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ తన వ్యతిరేకుల మీద యుద్ధాన్ని మొదలుపెట్టాడు. ఏకంగా చంపడాన్ని కూడా ప్రారంభించాడు. తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత.. దానికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అవమానకరంగా చనిపోయాడు. ఈ ప్రకారం నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వారికి ఎటువంటి ట్రీట్మెంట్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటా.

# వరి రైతులను నిండా ముంచేసిన తుఫాన్

విజయవాడ,మొంథా' తుఫాన్ వరి రైతులను నిండా ముంచేసింది. భారీ వర్షాలకు ఈదురుగాలు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. బాపట్ల, వేమూరు, రేపల్లె, తెనాలి ప్రాంతాలలో వేల ఎకరాలలో వరి నేలవాలిపోయింది. కంకుల దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. వరుసగా వర్షం కురుస్తుంఢంతో పంటపై రైతులు ఆశ వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళ్ల ముందే పంట నాశనం అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వరి పంటలకు అపార నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన సమయంలో వరి పంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటలు నేలపాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎకరానికి 30 వేల నుండి 40 వేల రూపాయల వరకు నష్టం వాటినట్టు వాపోతున్నారు. ఎకరానికి 40 బస్తాలు వచ్చే దిగుబడి ఇప్పుడు 10 నుండి 20 బస్తాలు మాత్రమే వచ్చే పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మంథా తుఫాను ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. నదీ పరీవాహక ప్రాంతాలలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ అన్నారు. పునరావాస కేంద్రాలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలలో జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, బుడమేరు ప్రస్తుతం కంట్రోల్లో ఉందని జిల్లా కలెక్టర్ లక్ష్మీ చెప్పారు. 'మొంథా' తుఫాన్ వరి రైతులను నిండా ముంచేసింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటలు నేలపాలు కావడంతో గుంటూరు జల్లా రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీ వర్షాలకు ఈదురుగాలు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. బాపట్ల, వేమూరు, రేపల్లె, తెనాలి ప్రాంతాలలో వేల ఎకరాలలో వరి నేలవాలిపోయింది. కంకుల దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నారు.

### నవీన్ యాదవ్ పక్కా లోకల్

హైదరాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పక్కా లోకల్ వ్యక్తి అని.. ఆయన గెలుపును ఎవరూ ఆపలేరని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు.ఉప ఎన్నిక దృష్ట్యా నియోజకవర్గంలోని బోరబండ డివిజన్ లో నవీన్ యాదవ్ కు మద్దతుగా సీతక్క విస్తృతంగా పర్యటించారు. నవీన్ యాదవ్‌ను పదే పదే రౌడీ షీటర్ అని బీఆర్ఎస్ వాళ్లు అనడం కరెక్ట్ కాదని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో తామేం చేశామో ప్రజలకు అంతా తెలుసని అన్నారు. మరోసారి మా కేబినెట్‌ను దండుపాళ్యం

# భారీ యుద్ధానికి రంగం సిద్ధం!... కొత్త దేశం ఏర్పడుతుందా?



ఇస్లామాబాద్:ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య, పలు ప్రాంతాల్లో తీవ్ర ఘర్షణలు నెలకొంటున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి పలు దేశాల మధ్య సీజ్ ఫైర్ అగ్రిమెంట్స్ జరిగినా.. ఆయా సరిహద్దులు మాత్రం నిత్యం నివురుగప్పిన నిప్పులా ఉంటున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇటీవల ముగిసినట్లే ముగిసిన ఓ యుద్ధం మరోసారి మొదలవ్వబోతోందని అంటున్నారు. అదే పాకిస్థాన్ – ఆఫ్ఘనిస్తాన్ మధ్య యుద్ధం!అవును... అఫ్ఘనిస్థాన్–పాకిస్థాన్ మధ్య ఇటీవల తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే... టర్కీ, ఖతార్ కల్పించుకుని మధ్యవర్తిత్వం చేయడంతో కొన్ని రోజులు కాల్పుల విరమణ జరిగింది. అయితే తాజాగా టర్కీ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఈ దేశాల మధ్య ఘర్షణలు మొదలయ్యే సూచనలు ఉన్నాయని అంటున్నారు.

శాంతి చర్చలు విఫలం!:

సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం, మొదలైన అంశాలపై ఈ రెండు దేశాల మధ్య శనివారం టర్కీ వేదికగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇవి విఫలమైనట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ సందర్భంగా స్పందించిన పాక్ సమాచార, ప్రసారశాఖమంత్రి అతావుల్లా తరార్.. చర్చల్లో ఎలాంటి పరిష్కారమూ కనుగొనలేకపోయినట్లు తెలిపారు.

భారత్ పై పడి పాక్ ఏడుపు!:

ఇటీవల ఢిల్లీ – కాబూల్ మధ్య బంధం మరింత బలపడుతున్న వేళ పాకిస్థాన్ కడుపు తెగ మండిపోతుందనే చెప్పాలి. ఇప్పటికే ఢిల్లీ చెప్పినట్లుగా కాబూల్ ఆడుతుందని.. వారి తరుపున తాలిబన్లు తమపై ప్రాక్సీ యుద్ధం చేసున్నారని పాక్ ఆరోపించింది. ఈ క్రమంలో తాజాగా శాంతి చర్చలు విఫలమవ్వడంతో మరోసారి భారత్ పై ఏడుపు మొదలుపెట్టింది.ఇందులో భాగంగా... కాబుల్ తో చర్చలు విఫలమవ్వడానికి భారత్ కారణమని పాక్ రక్షణ మంతి ఆసిఫ్ ఖవాజా ఆరోపించారు. ఈ సందర్భంగా... భారత్ చేతిలో తాలిబన్లు కీలుబొమ్మలుగా మారారంటూ విమర్శలు చేశారు. కాబుల్ తో ఒప్పందానికి దగ్గరవుతున్నప్పుడల్లా, కొందరు జోక్యం కారణంగా చర్చలు విఫలమవుతున్నాయని పరోక్షంగా భారత్ పై విమర్శలు చేశారు.

బలుస్థాన్ పై పాక్ వైమానిక దాడులు!

బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) లక్ష్యంగా పాకిస్థాన్ మంగళవారం అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో సుమారు 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. బలోచిస్థాన్ లోని చిల్తాన్ పర్వత ప్రాంతంలో బీఎల్ఏ ఉగ్రవాదులే లక్ష్యంగా పాక్ బలగాలు కచ్చితమైన వైమానిక దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. తాజా దాడుల నేపథ్యంలో ఉగ్రవాదులకు సంబంధించిన అనేక తాత్కాలిక రహస్య స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నట్లు సమాచారం!

స్వతంత్ర దేశంగా బలుస్థాన్..!:

కొంతకాలంగా తమ భూభాగాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని పాక్ పై పోరాటం చేస్తున్న బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఈ ఏడాది మే నెలలో స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు బలూచిస్తాన్ రచయిత మీర్ యార్ బలూచ్.. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. ఇదే సమయంలో... న్యూఢిల్లీలో బలూచిస్తాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అయితే తదుపరి పరిణామాల నేపథ్యంలో మళ్లీ ఆ ప్రాంతం పాక్ సైన్యం చేతుల్లోకి వెళ్లిన పరిస్థితి! ఈ నేపథ్యంలో ఓ పక్క ఆఫ్ఘాన్ తో మళ్లీ యుద్ధం మొదలవ్వొచ్చనే ఊహాగాణాలు.. మరోపక్క ఆఫ్ఘన్ కు భారత్ పరోక్ష మద్దతు ఉందనే పాక్ అనుమానాలు కమ్ భయాల నేపథ్యంలో... కాబుల్ – ఇస్లామాబాద్ మధ్య యుద్ధం అనివార్యమైతే.. ఈ గ్యాప్ లో బలుచిస్థాన్ నుంచి పాక్ పై తీవ్రమైన దాడులు ఉండొచ్చని అంటున్నారు.సందట్లో సడేమియాలాగా... పాక్ – ఆఫ్ఘాన్ మధ్య యుద్ధం తీవ్రమైతే ఆ గ్యాప్ లో బీఎల్ఏ.. తమ ఆధిపత్యాన్ని పూర్తిగా కనబరిచే అవకాశం ఉందని.. తమ దేశాన్ని అధికారికంగా ఏర్పాటు చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు పరిశీలకులు! అదే జరిగితే... ఈ ప్రపంచ పటంపై కొత్త దేశం అధికారికంగా ఏర్పడినట్లే!కాగా... కోటిన్నర జనాభా ఉన్న బలూచిస్తాన్, పాకిస్తాన్ లోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఒక ప్రావిన్స్.. దీర్ఘకాలంగా స్వాతంత్ర్య ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. తమ సహజ వనరుల దోపిడీ, రాజకీయ హక్కుల ఉల్లంఘన, పాక్ సైన్యం చేస్తున్న అణచివేతలపై బలూచ్ ప్రజలు దశాబ్ధ కాలంగా ఆందోళన చేస్తున్నారు! అయితే వారి కోరిక పాక్ – ఆఫ్ఘన్ యుద్ధ సమయంలో తీరే అవకాశం ఉందని అంటున్నారు!

# వైసీపీ ఒంటరితనం... ఆశలు పెంచుతోందా?

అమరావతి,ఒకటి ఒంటరి అంకె అని ఎవరూ చెప్పక్కర్లేదు. అది అంతే. ఇక రాజకీయాల్లో ఒంటరితనం పూర్తిగా అనుభవిస్తున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క ఒక్క వైసీపీ మాత్రమే అని అంటారు. వైసీపీది దాదాపుగా చూస్తే పదిహేనేళ్ళ రాజకీయ ప్రస్థానం. ఈ మొత్తం ప్రయాణంలో చూసుకుంటే సింగిల్ సోలో ఈ రెండు పదాలతోనే అడుగులు వేసింది. కాలం కలసి వచ్చి అవే బలమైన నినాదాలుగా మారాయి. ఎంతదాకా అంటే సింహం సింగిల్ గానే వస్తుంది అన్నట్లుగా. అయితే ఈ డైలాగులు ఒక సమయంలో బాగా పేలాలి. అన్ని సమయాలలోనూ కుదరవు అన్నది తరువాత కథ నిరూపించింది.

వ్యూహం మిస్ అయ్యారా :

దేశంలో అనేక పార్టీలు వచ్చాయి. అవన్నీ కూడా ఏదో ఒక దశలో పొత్తులు పెట్టుకున్నాయి. ఎటువంటి పొత్తులు ఎత్తులు లేకుండా రాజకీయం చేసిన పార్టీ వైసీపీయే. అందుకే మూడు ఎన్నికలలో ఒకటి మాత్రమే సానుకూల ఫలితం ఇస్తే రెండు సార్లు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 2024లో అయితే వైసీపీ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. ఓట్ల పరంగా చూస్తే 40 శాతం షేర్ ఉంది కానీ సీట్లు బొత్తిగా 11 కి పడిపోయాయి. దాంతో వైసీపీకి అధికారం కాదు కదా సరైన రాజకీయ గౌరవాన్ని ఇచ్చే స్థాయిలో సీట్లు కూడా దక్కడం కష్టమైంది అన్నది ఈ ఫలితాలు తెలియచేశాయి. ఇలా చూస్తే కనుక వైసీపీ విషయంలోనూ అదే జరుగుతోంది అని అంటున్నారు. ఇక్కడే వైసీపీ రాజకీయ వ్యూహం మిస్ అయింది అని అంటున్నారు.

తప్పు కానే కాదుగా :

ఎన్నికలు అంటే ఎన్నో అంశాలు మిళితం అయి ఉంటాయి. పొత్తులు కూడా ఒక పవర్ ఫుల్ స్ట్రాటజీ. దానిని ఎపుడు ఎలా ఉపయోగించాలో టీడీపీకి తెలిసినంతగా మరే పార్టీకి తెలియదు అందుకే తెలుగుదేశం ఎవరు ఏమనుకున్నా పొత్తులకే వెళ్తుంది దానిని ఎద్దేవా చేస్తూ వైసీపీ భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది. ఇపుడు వైసీపీ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉంది అని అంటున్నారు. వైసీపీ బలం ఎంత అన్నది 2024 ఎన్నికల్లో రుజువు అయింది. వచ్చే ఎన్నికల నాటికి మరి కొంత బలం సమకూరినా కూడా మూడు పార్టీలు పైగా కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలతో ఢీ కొని నెగ్గుకుని రావడం బహు కష్టం అన్న భావన అయితే వ్యక్తం అవుతోంది

కూటమి కట్టాల్సిందేనా :

ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. అయితే అదే అపొజిషన్ ఫ్లాట్ ఫారం మీద కాంగ్రెస్ వామపక్షాలు, ఇతర పార్టీలు ఉన్నాయి. ఆయా పార్టీలను కలుపుకుని వైసీపీ కూడా ఒక కూటమిని ఏర్పాటు చేసుకుంటే 2029 ఎన్నికల్లో టీడీపీ కూటమిని గట్టిగా ఢీ కొట్టే స్థితికి చేరుకోవచ్చు అన్నది విశ్లేషణగా ఉంది. అయితే వైసీపీ ఈ విషయంలో ఎంతవరకూ మొగ్గు చూపుతుంది అన్నది చూడాల్సి ఉంది. సింగిల్ గానే అన్నది ఈ రోజుకీ పార్టీలో వినిపిస్తున్న మాట. దానికి వైసీపీ లాజిక్ ఏమిటి అంటే పార్టీలో ఎందరో పనిచేస్తూ ఉన్నారు. వారికి



అవకాశాలు తగ్గించి పొత్తుల పేరుతో వేరే పార్టీలకు ఇవ్వడం వల్ల వారు నష్టపోతారు అని. అది కొంతవరకూ నిజమే అనుకున్నా అధికారం దక్కించుకోకపోతే టోటల్ గా పార్టీ నష్టపోతుంది కదా అన్నది మరో వాదనగా ఉంది.

చాలా పరిమితులున్నాయి :

ఏపీలో ఈ రోజుకు చూస్తే వైసీపీ ఒంటరి పార్టీగానే ఉంది. అయితే జై భీమ్ అన్న పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ వంటి వారు వైసీపీతో పొత్తు కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీతో కలసి వెళ్తామని ఆయన ఇప్పటికే చెబుతున్నారు. ఇక ఆమ్ ఆద్మీ బీఎస్పీ లాంటి పార్టీలు కూడా ఉన్నాయి. వాటిని కలుపుకోవాలా వద్దా అన్నది చూడాల్సి ఉంది. వామపక్షాలు రెండు రకాల వైఖరితో వైసీపీ మీద ఉన్నాయి. సీపీఎం అయితే కాస్తా సాఫ్ట్ కార్నర్ తో ఉన్నా సీపీఐ ఎలా రియాక్ట్ అవుతుందో తెలియదు, పైగా ఈ రెండూ ఇండియా కూటమిలో జాతీయ స్థాయిలో ఉన్నాయి. కాంగ్రెస్ లేకుండా వామపక్షాలు వైసీపీతో జత కట్టే పరిస్థితి ఉండదు అని అంటున్నారు. దాంతో కాంగ్రెస్ ని దగ్గరకు తీసే విషయంలో వైసీపీ తన పర్మనెంట్ పొలిటికల్ స్టాండ్ నే మార్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

అనివార్యంగానే :

అయితే ఈసారి పొత్తులు వైసీపీకి అనివార్యంగానే ఉన్నాయి అని అంటున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు గట్టిగా మూడున్నరేళ్ళ సమయం ఉంది. అప్పటికి ఎన్నో జరుగుతాయని అంటున్నారు. కాంగ్రెస్ తో కచ్చితంగా వైసీపీ నడవాల్సిన పరిస్థితులు రావచ్చు అన్న మాట కూడా ఉంది. ముఖ్యంగా బీహార్ తరువాత జాతీయ రాజకీయాల్లో మార్పు ఏపీ మీద ప్రభావం చూపిస్తుంది అని అంటున్నారు మరో వైపు చూస్తే వైసీపీతో కలిసేందుకు చిన్న పార్టీలు ఆసక్తిగా ఆశగా ఉన్నాయి. వైసీపీ ముందుకు వస్తే కాంగ్రెస్ వామపక్షాలు సైతం సై అంటాయి. మొత్తం మీద వైసీపీ దీర్ఘకాలంగా ఎంచుకున్న రాజకీయ ఒంటరితనం ఈసారి భగ్నం అయ్యే అవకాశాలే అధిక శాతం ఉన్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# మొత్తానికి నితీష్ ని సీఎం చేసేసారు

పాట్నా:బీహార్ లో రాజకీయం ఎత్తుకు పై ఎత్తుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికి ఎవరూ తీసిపోకుండా వ్యూహాలకు పదును పెడుతున్నారు. తమదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉంటే బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి వర్సెస్ మహా ఘట్ బంధన్ పోటా పోటీగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. మహా ఘట్ బంధన్ నుంచి తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్నారు. ఎన్డీయే నుంచి ఎవరు అని ఆ రోజు నుంచే గట్టిగా ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఎందుకంటే ప్రత్యర్థిగా ఉన్న బీజేపీని ఈ విషయంలో కార్నర్ చేయడమే మహా ఘట్ బంధన్ ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది.

చెబితే తంటా లేకుంటే మంట :

సరిగ్గా ఇదే పాయింట్ దగ్గర కమలం పార్టీ ఆర్జేడీకి దొరికేసింది అని అంటున్నారు. ఈసారి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు అన్నది ప్రకటించకుండానే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ పక్కాగా ప్లాన్ చేసింది. ఎందుకంటే నితీష్ కుమార్ ని అభ్యర్థిగా ప్రకటిస్తే ఆయన పరిపాలన మీద ఉన్న యాంటీ ఇంకెంబెన్సీని కోరి కూటమి మీద వేసుకోవాల్సి ఉంటుంది అదే సమయంలో యువకుడు అయిన తేజస్వి యాదవ్ వర్సెస్ నితీష్ అంటే సహజంగానే మార్పు కోరే వారి మొగ్గు ఆ వైపుగా నూరు శాతం పోతుంది. యువత కూడా పూర్తిగా టర్న్ అవుతుంది. అలాగని కాదు అనుకుంటే జేడీయూ వర్సెస్ బీజేపీల మధ్య చిచ్చు పెట్టడం ద్వారా ఆర్జేడీ పాచిక పారుతుంది. దాంతో గురి చూసి మరీ మీ సీఎం అభ్యర్థి ఎవరో ప్రకటించాలని డిమాండ్ చేసింది.

ఎట్టకేలకు ఓకే :

మొత్తానికి ఆర్జేడీ పంతమే నెగ్గినట్లు అయింది. బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ తన సీఎం అభ్యర్థిని ప్రకటించింది. నితీష్ కుమార్ తమ కూటమి అభ్యర్థిగా బీజేపీ అగ్ర నేత అమిత్ షా ప్రకటించారు. ఆయన సారధ్యంలోనే ఎన్నికలకు వెళున్నామని చెబుతూనే సీఎం గా నితీష్ ఉంటారని ఆయన సీటు ఇప్పట్లో ఖాళీ అయ్యే చాన్స్ లేదని కూడా అన్నారు. బీహార్ లో విపక్షానికి అసలు చాన్స్ లేనే



లేదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. అదే సమయంలో ఆర్జేడీని పొరపాటున ఎన్నుకుంటే కనుక రాష్ట్రం మరో ఇరవై ఏళ్ళు వెనక్కు పోతుందని కూడా అమిత్ షా హెచ్చరించడం గమనార్హం. బీహార్ ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా ఎన్డీయేకే ఉందని ఆయన చెబుతున్నారు.

పొరపాటు జరుగుతుందా :

అమిత్ షా మాటలే తీసుకుంటే పొరపాటున మహా ఘట్ బంధన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఇబ్బందులో పడుతుందని అంటున్నారు. నిన్నటిదాకా మేమీ అధికారంలోకి వస్తామని చెప్పిన బీజేపీ పెద్దల నోట ఇపుడు పొరపాటున అయినా మహా ఘట్ బంధన్ ప్రసక్తి అయితే రాకూడదు కదా అని అంటున్నారు. మరి ప్రత్యర్థి కూటమి అధికారంలోకి వస్తే అంటూ ఆయన చెబుతున్న ఈ మాటలు చూస్తే ఎక్కడో ఏమైనా తేడా జరుగుతోందా అన్న చర్చ అయితే సాగుతోంది. మొత్తానికి నితీష్ కుమార్ ని సీఎం అభ్యర్థిగా ప్రకటింప చేయడం ద్వారా ఆర్జేడీ సగం విజయం సాధించింది అని రేపటి ఎన్నికల్లో గెలిచి పూర్తి విజయం సాధిస్తుందని అంటున్నారు. చూడాలి మరి బీహార్ ఎన్నికలు ఏ తీరున సాగుతాయో ఫలితాలు ఏ విధంగా వస్తాయో మరి.

# ఆ సీటు మీదనే జేడీ టార్గెట్...పార్టీ మాత్రం ?



అమరావతి,జేడీ లక్ష్మీ నారాయణ అంటే అందరికీ తెలుసు. వీవీ లక్ష్మీనారాయణ అంటే ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆయన ఒంటి పేరు వీవీ. అధికారిక హోదా కలిగిన జేడీయే అసలు పేరుగా స్థిరపడిపోయింది. సీబీఐలో సమర్ధవంతమైన అధికారిగా వ్యవహరించిన జేడీ లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని ఎంతో ఉత్సాహపడ్డారు. అందుకే తన పదవీ విరమణకు ఎంతో కాలం ఉన్నా చేతిలో ఎంతో సర్వీసు ఉన్నా కూడా కేవలం 53 ఏళ్ళకే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు.

ఫస్ట్ ఇంప్రెషన్ లోనే :

ఆయన 2019లో తొలిసారి విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేశారు. జనసేన నుంచి ఆయన పోటీ పడితే ఏకంగా రెండు లక్షల ఎనభై వేల దాకా ఓట్లు వచ్చాయి. ఇందులో జేడీని ఆరాధించి అభిమానిచిన యువత ఓటేసింది. అలాగే పవన్ కళ్యాణ్ ని అభిమానించే వారు కూడా తోడు అయి అంత భారీ ఎత్తున ఓట్లు దక్కాయి. అయితే జేడీ జనసేనలో కొనసాగి ఉండాల్సింది అని అంటారు. కానీ ఓటమి తరువాత ఆయన పార్టీకి రాజీనామా చేయడం ఆ మీదట 2024 ఎన్నికలకు ముందు జ భారత్ నేషనల్ పార్టీ పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేయడం ఇవన్నీ రాజకీయంగా చేసిన కొన్ని ఇబ్బందికరమైన నిర్ణయాలుగానే అంతా చూస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో తన సొంత పార్టీ మీద విశాఖ ఉత్తరం నుంచి పోటీ చేస్తే జేడీ బాగా వెనకబడిపోయారు.

ఈసారి టార్గెట్ అదే :

అయితే ఓటమి తరువాత కొన్నాళ్ళ పాటు విశాఖలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మీద తన నిరసనను ఉద్యమాన్ని చేసిన జేడీ క్రమేణా విశాఖకు దూరంగా ఉంటూ వస్తున్నారు ఆయన వర్తమాన రాజకీయాన్ని రాజకీయ పార్టీల మనోగతాన్ని అర్థం చేసుకుని ఆ విధంగా తన రాజకీయాన్ని మలచుకోవడానికే ఈ గ్యాప్ తీసుకుంటున్నారు అని అంటున్నారు. ఆయన వచ్చే ఎన్నికల కోసం కూడా భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు అని అంటున్నారు. ఆయన టార్గెట్ అయితే విశాఖ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంట్ లో అడుగు పెట్టాలని. అది 2019లో జరగలేదు, ఆ ముచ్చట 2029లో తీర్చుకోవాలని జేడీ చాలా గట్టిగానే భావిస్తున్నారు అని అంటున్నారు.

పార్టీ అదేనా :

ఇక జేడీ ఏ రాజకీయ పార్టీలో చేరుతారు అన్నది మరో చర్చ. నిజానికి చూస్తే ఆయన ఇపుడు ఏ రాజకీయ పార్టీని విమర్శించడం లేదు అన్ని పార్టీల పట్ల పాజిటివ్ గానే ఉన్నట్లుగా కనిపిస్తున్నారు. అదే సమయంలో అన్ని అవకాశాలూ ఓపెన్ చేసి పెట్టుకున్నారు అని అంటున్నారు 2029 నాటికి మారే రాజకీయాన్ని గమనంలోకి తీసుకోవడం ద్వారా ఆయన ఏదో ఒక బలమైన రాజకీయ పార్టీలో చేరడం ద్వారా విశాఖ ఎంపీగా పోటీ చేసి కచ్చితంగా నెగ్గాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఇంతకీ జేడీ ఏ పార్టీ అంటే ఎవరూ ఇపుడు చెప్పలేరు, అయితే ఆయన సొంత రాజకీయం సొంత పార్టీ కథ మాత్రం ఇక మీదట ఉండకపోవచ్చు అని పవర్ ఫుల్ పార్టీలోనే చేరడం ద్వారా తన ఆకాంక్షను నెరవేర్చుకుంటారు అని అంటున్నారు. అది జాతీయ పార్టీనా లేక ప్రాంతీయ పార్టీనా అంటే ఇప్పటికైతే సస్పెన్స్ అని అంటున్నారు. చూడాలి మరి జేడీ అడుగులు ఎటు పడతాయో ఆయన రాజకీయం రూట్ ఏ వైపు సాగుతుందో.

# ఏబీ ఎందుకిలా.. టీడీపీకి నష్టం చేకూర్చాలనేనా?




అమరావతి,ఆంధ్రప్రదేశ్ మాజీ ఇంటెలిజెన్స్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి ఇబ్బందిగా మారారు. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వానికి అందులోనూ టీడీపీకి తలనొప్పిగా తయారయ్యాయి. ఆయన మాజీ పోలీసు అధికారిగా ఆ వ్యాఖ్యలు చేసినప్పటికీ సామాజికవర్గం కోణంలో చూసే వారికి ఏబీ టీడీపీకి నష్టం చేకూర్చే విధంగా వ్యాఖ్యానిస్తున్నారని అంటున్నారు. ఇటీవల కందుకూరు ఘటన అమానుషం. ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. కులాలు, మతాలు పక్కన పెడితే మానవీయ కోణంలో ఆలోచించాల్సిన ఘటన అది. వాహనంతో తొక్కించి ఒకరి మృతికి కారణమై, మరొక ఇద్దరు యువకులు తీవ్రగాయాలు పాలయిన ఘటన ఆంధ్రప్రదేశ్ లో సంచలనం కలిగించింది. ఏబీ పంటికింద రాయిలా మారారు.

రాజకీయ రంగు పులుముకుని...

అయితే అది రాజకీయ రంగు పులుముకుంది. బాధితులు కాపు సామాజికవర్గానికి చెందిన వారు కావడం, హత్య చేసింది కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై నిందితులను అరెస్ట్ చేసింది. బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించడమే కాకుండా నాలుగు ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నిజానికి మానవీయ కోణంలో తీసుకున్న నిర్ణయమిది. హత్యకు కారణాలు ఏవైనా ఉండవచ్చు గాక, హత్య జరిగిన తీరు అమానుషమని ప్రతి ఒక్కరూ ఖండించారు. చంద్రబాబు నాయుడు కూడా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడమే కాకుండా బాధితుల కుటుంబానికి పరిహారం ప్రకటించారు.

ఏబీ కామెంట్స్ పై...

అయితే ఏబీ వెంకటేశ్వరరావు మాత్రం ఈ ఘటనపై స్పందించిన తీరు ఆక్షేపణీయంగా ఉందంటున్నారు. ఇలా హత్య జరిగిన వారందరికీ పరిహారం అందించుకుంటూ పోతే ప్రజాధనం వృధా చేసినట్లేనని, ఎవరి సలహాతో పరిహారం ఉత్తర్వులు జారీ చేశారని ప్రశ్నించారు.

రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేయడమేంటని నిలదీశారు. దీనిపై కాపు సంఘం నేత దాసరి రాము మండిపడ్డారు. మరి రాజకీయ గొడవల్లో మరణించిన కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించినప్పుడు నోరు పెగలలేదేం అని ప్రశ్నించారు. దీనికి జీవో ఇవ్వడం సబబేనా? అని నిలదీశారు. మొత్తం మీద ఏబీ వెంకటేశ్వరరావు సైకిల్ పార్టీకి విలన్ గా మారిపోయాడు. ఆయన ఏదోఒకటి రచ్చ చేయడం అది ప్రభుత్వానికి చుట్టుకోవడం పట్ల టీడీపీ నేతలే ఆందోళన చెందుతున్నారు. సీనియర్ ఐపీఎస్ అయిన ఆయన ఇలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నారు.

# 8వ వేతన సవరణ సంఘంతో గొప్ప నిర్ణయం

హైదరాబాద్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ దిశగా కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయంపై కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 8వ వేతన సవరణ సంఘం విధివిధానాలను ఆమోదించినందుకు కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన స్పందించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నినాదం ఆధారంగా దేశంలోని ప్రతివర్గం సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కృషికి సరైన గుర్తింపు ఇవ్వడమే కాకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. వేతన సవరణతో ఉద్యోగుల్లో ఉత్సాహం పెరగడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉత్పాదకత పెరిగి ప్రజా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందన్నారు. ఉద్యోగుల ఆర్థిక స్థితి మెరుగుపడటం ద్వారా దేశీయ వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి కూడా ఊతమిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన పేర్కొంటూ మోదీ గారు నాయకత్వం వహించిన తర్వాత 2016లో 7వ వేతన సవరణ కమిషన్ ద్వారా ఉద్యోగులకు అనుకూలమైన సంస్కరణలు తీసుకువచ్చారు. 2006లో జరిగిన 6వ పీఆర్సీలో కనీస వేతనం రూ.7 వేలుగా ఉండగా, 7వ పీఆర్సీలో దాన్ని రెండున్నర రెట్లు పెంచి రూ.18 వేలుగా



నిర్ణయించారు. అంతేకాకుండా, కనీసం 3 శాతం ఇంక్రిమెంట్ తప్పనిసరిగా ఇవ్వాలనే నిర్ణయం కూడా మోదీ ప్రభుత్వంలోనే తీసుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు 8వ పీఆర్సీ ద్వారా కేంద్ర ప్రభుత్వం మరిన్ని మార్పులు తీసుకువచ్చిందని, ఈ నిర్ణయం ద్వారా 50 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షలకు పైగా పెన్షనర్లు లబ్ది పొందనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉద్యోగుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ద్విగుణీకృత ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com